13082024-MAI-04_Layout 1 8/13/2024 1:12 AM Page 1

విశ్వక్రీడల్లో వెనుకబాటు

ప్యారిస్ ఒలింపిక్స్ క్రీడలు మన దేశానికి అనేక కారణాల వల్ల గుర్తుండిపోతాయి. ఒక్క టంటే ఒక్క స్వర్ణం రాలేదు. మను భాకర్ సింగిల్స్ కాంస్యంతో శుభారంభం చేసినా ముగింపు నిరాశాజనకమే. మిక్స్‌డ్ షూటింగ్‌లోనూ సరబ్ జ్యోత్‌సింగ్‌తో కలిసి మను మరో కాంస్యం అందుకోవడంతో ట్యాలీ 3కు పెరిగింది. 50 మీటర్ల రైఫిల్ పోటీల్లో స్వప్నిల్ కూసాలే కాంస్యం గెల్చుకోగా, హాకీ టీం కూడా కాంస్యంతోనే సరిపెట్టుకున్నది. కాకపోతే వరుసగా రెండు ఒలింపిక్స్‌లో హాకీ టీం పతకాలు గెలవడం విశేషం. 44 ఏండ్లుగా మన హాకీ జట్టుకు స్వర్ణం అందని ద్రాక్షగా ఉండిపోయింది. కుస్తీల్లో అమన్ సెరావత్ కూడా కాంస్యం దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది. జావెలిన్ త్రోలో నీరజ్ రజతం గెల్చుకోవడం కొద్దిగా ఊరటనిచ్చింది. ఇదంతా ఒకెత్తు, రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఉదంతం ఒకెత్తు. స్వర్ణం సాధిస్తుందనుకున్న ఈ కుస్తీ యోధురాలు చివరి నిమిషంలో కేవలం వంద గ్రాముల అధిక బరువు కారణంగా పోటీకి అనర్హురాలు కావడం పెను విషాదం. దాంతో ఉవ్వెత్తున ఎగసిన ఆశలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఆ చేదు అనుభవం కారణంగా అంతర్జాతీయ పోటీల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్టు ఆమె ప్రకటించడం మరింత బాధాకరం. వినేశ్ బరువును చూసుకోవాల్సిన సహాయక బృందం వైఫల్యమే ఆమె బరువు సమస్యకు కారణమనే వాదన వినవస్తుండటం గమనార్హం. యావత్తు దేశం ఆమె ఆవేదనలో పాలుపంచుకున్నది. ఓటమితో వెనుదిరిగిన ఓ క్రీడాకారిణి స్ఫూర్తి అపూర్వ గౌరవాన్ని పొందడం చిన్న విషయం కాదు.

టోక్యోతో పోల్చితే పతకాలు తగ్గినా క్రీడాకారుల సామర్థ్యం మెరుగుపడిందనే ప్రశంసలు వస్తుండటం ముదావహం. అయినప్పటికీ అంతర్జాతీయ ప్రమాణాలు సాధించడంలో మనం వెనుకబడిపోయామనేది ఒప్పుకొని తీరాల్సిన వాస్తవం. 117 మందితో వెళ్లిన భారత ఒలింపిక్స్ టీం 6 పతకాలతోనే సరిపెట్టుకోవాల్సి రావడం మన దేశపు క్రీడా నాయకత్వం ఆలోచించాల్సిన విషయమే. ప్రభుత్వం, క్రీడా సంఘాలు తమ విధానాలను, ఆచరణను లోతుగా సమీక్షించుకోవాల్సిన సందర్భం ఇది. భారత్‌కు పతకాలు రాకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యంగా గత పదేండ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఎన్డీయే సర్కారు క్రీడారంగంలో సాధించిన ప్రగతి ఏమిటనేది పెద్ద ప్రశ్న. ప్రధాని మోదీ క్రీడాపోటీల విజేతలతో ఫొటోలు దిగేందుకు చూపే ఉత్సాహంలో కొంచెమైనా క్రీడల అభివృద్ధి పట్ల చూపకపోవడం విచారకరం. పైగా క్రీడారంగంలో రాజకీయ నేతల పెత్తనం అడుగడుగునా కనిపిస్తుంటుంది. అస్మదీయులను అందలమెక్కించడం, ప్రతిభావంతులను అణగదొక్కడమనే జాడ్యం భారత క్రీడారంగానికి శాపంగా మారింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జైషే బీసీసీఐ కార్యదర్శిగా ఉండటం క్రీడల్లో బంధుప్రీతికి నిదర్శనం. అలాగే గతంలో బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ రెజ్లింగ్ సమాఖ్యలో తిష్టవేసుకుని కూర్చుని క్రీడాకారిణులను లైంగిక వేధింపులకు గురిచేయడంపై దుమారం చెలరేగింది. ఒలింపిక్స్‌లో స్వర్ణం దాకా వెళ్లి ఆగిపోయిన వినేశ్ ఫోగట్ అయినప్పై సాగించిన పోరాటం తెలిసిందే.

ఇలాంటి సమస్యలే కాకుండా మోదీ సర్కారు క్రీడలకు కేటాయిస్తున్న నిధులు అరకొరగా ఉండటం మరో సమస్య. ప్రపంచ దేశాలు క్రీడలకు సగటున జీడీపీలో 0.5 శాతం కేటాయిస్తుంటే, భారత్ కేటాయించేది 0.1 శాతమే. మొన్నటి బడ్జెట్‌లో నిధులు పెంచిన తర్వాత ఆ స్థాయికి చేరింది. అరకొర నిధుల పర్యవసానంగా క్రీడలకు మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలు తగినస్థాయిలో లేకపోవడం, క్రీడా మనస్తత్వ, వైద్య శాస్త్రాల్లో పురోగతి సాధించకపోవడం, ఆధునిక శిక్షణ వసతులు, శిక్షకులు అందుబాటులో ఉండకపోవడం వంటివి భారతీయ క్రీడారంగానికి శాపంలా పరిణమించాయి. వివిధ క్రీడలను ప్రోత్సహించడంలో సమతూకం పాటించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే మరో లోపం. ఒలింపిక్స్ పతకాల్లో భారత్ పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతుండటంపై కేంద్ర సర్కారు దృష్టిపెట్టాలి. వ్యవస్థాపరమైన, నిర్వహణాపరమైన లోపాలను చిత్తశుద్ధితో సవరించాలి. లేకపోతే అత్యధిక జనాభా కలిగిన దేశం అతి తక్కువ పతకాలతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి పదేపదే ఎదురవుతూనే ఉంటుంది.

స్వచ్ఛ బయో డీల్ స్వచ్ఛం కాదు

క్రిశాంక్ మన్నె

మన దేశంలో ఏ మంత్రయినా బాధ్యతలు స్వీకరించేటప్పుడు ఎలాంటి ఆశ్రిత పక్షపాతం చూపనని రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేస్తారు. అంతేకాదు, భారత ప్రభుత్వ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి పదవిలో ఉన్నంత కాలం తన కుటుంబ సభ్యులు ప్రభుత్వంతో ఎలాంటి వ్యాపారాలు చేయకుండా చూడాలి. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఈ నిబంధనలు వర్తించవా? అన్నది అసలు ప్రశ్న. conflict of interest కేసులో ఇందిరాగాంధీని కోర్టు అనర్హురాలిగా ప్రకటించినప్పుడు ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ కూడా గతంలో తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి చట్టానికి అతీతుడేమీ కాదు.

ఈ ఏడాదిలో తెలంగాణ నుంచి అమెరికాకు వెళ్లిన అతిపెద్ద బృందం ఇదే కావచ్చు. గతంలో ఐటీ మంత్రి, ఐటీ శాఖకు చెందిన అధికారులే పర్యటనకు వెళ్లేవారు. కానీ, ఈసారి మాత్రం ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యమంత్రి సిబ్బంది, ఇద్దరు మంత్రులు, కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక పత్రిక ఎడిటర్ కూడా ఆ బృందంలో ఉండటం ఆశ్చర్యకరం.

> **రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడమే కాదు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే మరింత మెరుగైన పనితీరును కనబరిచారని రుజువు చేయడం ఈ బృందం ముందున్న టాస్క్. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తారని ఆశిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ వారికి శుభాకాంక్షలు కూడా తెలిపారు.**

గత ప్రభుత్వ కృషిని, పనితీరును మెచ్చుకుంటూ కాగ్నిజెంట్ కంపెనీ విస్తరణతో సీఎం మొదటిరోజు పర్యటన ప్రారంభమవడం ఆహ్వానించదగిన విషయం. ఏదేమైనప్పటికీ వాల్ట్ కర్రా హోల్డింగ్స్ కంపెనీతో ఒప్పందంతో మొదటి రోజు అస్పష్టతతో ముగిసింది. ఆ కంపెనీ డైరెక్టర్లు సందేహాస్పదంగా ఉన్నారు. సదరు కంపెనీ ఆర్థిక స్థితిగతులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతేకాదు, ఆ కంపెనీ మునుపటి వ్యాపారాలు మూతబడ్డాయి. సదరు కంపెనీ తెలంగాణలో రూ.839 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్టు రేవంత్‌రెడ్డితో కలిసి ప్రకటించడం సంచలనం రేపింది. అసలు ఇలాంటి మోసపూరిత కంపెనీలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తున్నట్టు?

ఈ ఏడాది మొదట్లో రేవంత్ దావోస్ పర్యటన సందర్భంగా గోదీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ రూ.8 వేల కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. రూ.కోటి మాత్రమే పెయిడ్ అప్ క్యాపిటల్ ఉన్న కంపెనీ, వార్షిక స్టేట్‌మెంట్‌ను రూ.27 లక్షలుగా చూపిన కంపెనీ అసలు రూ.8 వేల కోట్ల పెట్టుబడులు పెట్టగలదా? ఈ ఒప్పందాన్ని ప్రకటించిన నాటి నుంచి గత ఆరు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడంలో విఫలమైంది.

రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మూసీ పునరుజ్జీవ పథకాన్ని తమ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చేపట్టింది. అయితే ఈ పథకానికి సంబంధించి ఎలాంటి వివరణాత్మక నివేదికలు లేవు. ఈ ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్ల అంచనా వ్యయం అవుతుందని మొదట కాంగ్రెస్ పాలకులు ప్రకటించారు. ఆ తర్వాత రూ.70 వేల కోట్లకు పెంచారు. తాజాగా రూ.1.50 లక్షల కోట్లకు సవరించారు.

ఈ భారీ ప్రాజెక్టును చేపట్టేందుకు సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్డ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం కార్యాలయంలో చర్చలు జరిగాయి. అయితే ఆ కంపెనీ యజమానులు నసీమ్ షహజాద్, ఒమర్ షహజాద్ ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. రూ.9 వేల కోట్ల మనీ లాండరింగ్‌కు సంబంధించి వారిపై లుకౌట్ నోటీసులు ఉన్నాయి. అంతేకాదు, వారు దేశం విడిచి పారిపోయారని పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అభియోగాలు మోపింది. అలాంటి కంపెనీ ప్రతినిధులతో మూసీ పునరుజ్జీవ పథకం గురించి సీఎం రేవంత్ చర్చించడం ఆశ్చర్యం కలిగించింది.

తెలంగాణలో బీర్లు విక్రయించేందుకు సోమ్ డిస్టిలరీస్‌కు కాంగ్రెస్ సర్కార్ అనుమతులు ఇవ్వడంపై ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. సదరు కంపెనీ నకిలీ మద్యానికి పేరుగాంచింది. కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు స్వాహా చేయడం, పన్ను ఎగవేతల కేసులో అరెస్టులు, బాల కార్మికులతో పని చేయించినందుకు గానూ బ్లాక్‌లిస్టులో చేరడం వంటి వాటికి ఆ కంపెనీ పేరుగాంచింది. అలాంటి కంపెనీకి అనుమతులు ఇవ్వడంపై ప్రతిపక్షాలు నిలదీశాయి. మీడియా, సోషల్‌మీడియాలోనూ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో అనుమతులను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం మీడియాకు లీకులిచ్చింది. ఈ కంపెనీ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల విరాళం సమర్పించినదే కావడం గమనార్హం. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ద్వారా ఈ విషయం వెల్లడైంది.

కేవలం ఆరు నెలల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ చేసుకున్న లోపభూయిష్ట చీకటి ఒప్పందాలివీ. ఇవన్నీ ఓవైపు ఉండగానే.. రేవంత్ అమెరికా పర్యటనలో రెండో రోజు స్వచ్ బయో కంపెనీ తెలంగాణలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెడుతుందని ప్రకటించడం షాక్‌కు గురిచేసింది. అసలు వాస్తవమేమిటంటే.. ఈ కంపెనీ స్థాపించింది 15 రోజుల కిందటనే. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ కంపెనీకి ఇద్దరు డైరెక్టర్లు ఉన్నారు. లక్నోలోని మెజ్జె బార్ మెడిటెరేనియన్ యజమాని శివానంద వారిలో ఒకరు. రెండో డైరెక్టర్ మరెవరో కాదు, స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. అతని చిరునామా ఫిలడెల్ఫియా. కానీ, స్వచ్ బయో కంపెనీ అధికారిక చిరునామా మాత్రం జూబ్లీహిల్స్‌లోని నవనిర్మాణ్ నగర్. ఈ చిరునామాలో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఉన్నది.

> **ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అసలు అక్కడ ఆ కంపెనీ పేరిట బోర్డే లేదు. కానీ, ఆ కంపెనీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. కంపెనీ డైరెక్టర్లు ఎంపోయూపై సంతకం చేయకపోవడం ఆశ్చర్యకరం. ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి సహచరుడు హర్ష పసునూరితో అందులో సంతకం చేయించారు. అంతేకాదు, సీఎం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులతో ఆయనే ఫొటోలకు ఫోజులిచ్చారు.**

శాస్త్రవేత్త ప్రవీణ్ పరిపాటి నేతృత్వంలోని సుగనిత్ కంపెనీతోనూ స్వచ్ బయో ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత తమ్ముడితో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల కోసం ఒప్పందం చేసుకున్నారని ప్రతిపక్షం బయటపెట్టడంతో రేవంత్‌రెడ్డి మొదటిసారి ఆత్మరక్షణలో పడిపోయారు. దీంతో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో వీడియోలు విడుదల చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌ను రక్షించేందుకు రామకృష్ణారావు తన విశ్వసనీయత, అనుభవాన్ని ఉపయోగించవలసి వచ్చింది. అమెరికా పర్యటన, తాము కంపెనీలతో చేసుకుంటున్న ఒప్పందాలకు సంబంధించి తమను విశ్వసించాలని జయేశ్ రంజన్ ప్రార్థిస్తున్నట్టు వీడియోలో చూడవచ్చు. మీడియాలో విస్తృతంగా వ్యాప్తిచెందిన ఈ వీడియోలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. దీంతో కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నష్టనివారణ చర్యలకు దిగారు. అయితే వాళ్ల ప్రయత్నం ఏ మాత్రం ఫలించలేదు.

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సుగనిత్ కంపెనీ, శాస్త్రవేత్త సాంకేతిక అనుభవాన్ని సమర్థించారు. కానీ, స్వచ్ బయో గురించి గాని, సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి ఆ కంపెనీకి డైరెక్టర్‌గా ఉండటం గురించి గాని ఆయన ఒక్కమాట కూడా ప్రస్తావించలేదు. సాధారణంగా అమెరికా పర్యటన, డెలిగేట్స్‌తో సమావేశాలు, ఎంపోయాల గురించి ప్రతి విషయాన్ని తన అధికారిక, సీఎంవో ఎక్స్ ఖాతాల్లో షేర్ చేసే ఐటీ మంత్రి.. వాల్ట్ కర్రా, స్వచ్ బయో లాంటి ఒప్పందాల గురించి పోస్టు చేయలేదనే విషయాన్ని నెటిజన్లు గుర్తించారు.

చామల కిరణ్ లాంటి కొందరు ఎంపీలు సీఎంను సమర్థించే క్రమంలో అయోమయానికి గురయ్యారు. ఆ కంపెనీ సీఎం తమ్ముడి సొంతం కాదని, ఆయన కంపెనీకి డైరెక్టర్‌గా మాత్రమే ఉన్నారని, ప్రమోటర్‌కు సన్నిహితుడని చెప్పారు. సీఎం రేవంత్ కుటుంబసభ్యులు వ్యాపారాలు చేస్తే తప్పేంటని కిరణ్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి ప్రశ్నించారు. తెలంగాణకు అమెరికా నుంచి వేల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తున్నట్టు వారు సమర్థించారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని మంత్రులు, అధికారుల బృందం ఎంపోయూపై సంతకాలు చేసి, బహిరంగంగా ఒప్పందాల గురించి ప్రకటించిన విషయాన్ని మరిచిపోయి.. రేవంత్‌ను సమర్థించే క్రమంలో ఒప్పందంలోని పని ఇంకా ప్రారంభం కాలేదని కొందరు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అనేక ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన రేవంత్ కాంగ్రెస్ నేతల వాదనలతో మరింత ఇరకాటంలో పడ్డారు.

> **ఈ మొత్తం వ్యవహారం రాజ్యాంగబద్ధమైన కార్యాలయాన్ని, ఎవరి పట్ల ఆశ్రిత పక్షపాతం చూపనని అతను చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించినందున సీఎం పదవికి ఎసరు తేవచ్చు. అంతేకాదు, సీఎం తాను పేద కుటుంబానికి చెందినవాడినని పదే పదే చెప్పున్నందున.. పెట్టుబడి పెట్టేందుకు రూ.వెయ్యి కోట్లు ఎలా సంపాదించారనే విషయాన్ని అతని సోదరుడు వివరించాలి. మనీ లాండరింగ్ ఏమైనా ఉందా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాలి.**

ఒకవేళ కంపెనీ డైరెక్టర్లు ఆదాయ వనరులను వివరించడంలో విఫలమైతే, బ్రాండ్ విలువను పెంచే ఉద్దేశంతో షెల్ కంపెనీ లాగా ఆ ప్రకటన వెనుక నేరపూరితమైన ఉద్దేశం ఉండి ఉంటే అది Conflict of interest కింద సీఎం రేవంత్‌కు తీవ్ర సమస్యగా మారవచ్చు. కంపెనీ డైరెక్టర్ ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి తన చిరునామా ఫిలడెల్ఫియా అని ప్రకటించినందున వ్యాపార లావాదేవీలు, పన్నులకు సంబంధించి ఫెడరల్ ఏజెన్సీలు అతన్ని ప్రశ్నించవచ్చు. అదేవిధంగా మన దేశంలోని కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా స్వచ్ బయో ద్వారా రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, అతని సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి, మరో డైరెక్టర్ శివానంద, హర్ష పసునూరిలను ప్రశ్నించవచ్చు. అంతేకాదు, సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీని కాపాడే విషయంలో కంపెనీకి సంబంధించి తమ వ్యక్తిగత ప్రయోజనాలు ఏమిటనే విషయమూ ఆరా తీయవచ్చు. అదే కనుక జరిగితే సీఎం రేవంత్ సీటుకే గండం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

మేధావులకు నిజాయితీ అక్కరలేదా?

ఏది ఉన్నా లేకున్నా నిజాయితీ లేనివారిని మేధావులు అనవచ్చునా? తెలంగాణలో మేధావుల పేరిట ఒక బృందం చెలామణి అవుతున్నది. సాధారణ నిర్వచనాల ప్రకారం చూసినట్లయితే వారు మేధావులే. బాగా చదువుకున్నవారు. యూనివర్సిటీలలోనో, బయటనో పెద్ద ఉద్యోగాలు చేసినవారు. లేదా ఇంకా చేస్తున్నవారు. సెమినార్లలో, వర్క్‌షాప్‌లలో, సభలలో వారు గొప్పగా ఉపన్యసిస్తారు. అద్భుతమైన థియరీలు చెప్తారు. సునిశితమైన విశ్లేషణలు చేస్తారు. అంతా ప్రజల కోసమంటారు. మేధావులైనవారికి ఇంతకన్నా ఇంకేమి కావాలి? అందువల్ల వీరిని మేధావులని తప్పకుండా ఒప్పుకోవాలి. అయితే, మేధావులైనవారికి బహుశా మరొక లక్షణం కూడా ఉండాలి కావచ్చు. అది నిజాయితీ. ఈ మాట అనటం ఎందుకంటే, ప్రజలు ఇతరత్రా ఎవరికి ఏ లక్షణాలున్నా గుర్తించి మెచ్చుకుంటూనే, నిజాయితీ అన్నది లేకుంటే మాత్రం పెదవి విరిచి కొట్టివేస్తారు. మేధావుల మేధావితనానికి, గౌరవనీయతకు, విశ్వసనీయతకు నిజాయితీ అన్నది చివరి గీటురాయి అవుతుంది.

టంకశాల అశోక్

ఇప్పుడు నిర్దిష్ట అంశాలలోకి వెళ్దాము. ఈ మేధావులు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వ్యతిరేకించి, కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రచార రథాలకు జెండాలు ఊపి మరీ ప్రచారాలు చేశారు. సమస్య అది కాదు. అది వారి అభిప్రాయం, స్వేచ్ఛ. అదంతా వారు ప్రజల మేలును కోరి చేశారనుకోవాలి. అదేవిధంగా మరొకవైపు ప్రజలు తమ తమ కారణాల వల్ల బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారు. ప్రజాస్వామ్యంలో అది ప్రజల స్వేచ్ఛ. ఇంతవరకు దేని గురించి కూడా ఆక్షేపించవలసిందేమీ లేదు. విషయం ఆ తర్వాత నుంచి మొదలవుతుంది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఒక గెలిచిన పార్టీకి, ప్రజలకు మధ్య కాంట్రాక్టు ఒకటి ఏర్పడుతుంది. అధికారపక్షం ఆ కాంట్రాక్టు ప్రకారం నడుచుకుంటే ప్రజలు హర్షిస్తారు. లేనట్లయితే నిరసిస్తారు. ఇటువంటి కాంట్రాక్టు స్థితిలో జెండా మేధావుల వ్యవహరణ ఏ విధంగా ఉండాలి? ఏ విధంగా ఉండాలని స్వయంగా వారనుకుంటున్నారు?

మనకు కలిగే ఆలోచన ప్రకారమైతే, వారు జెండాలూపింది ప్రజల కోసమే అయినప్పటికీ, కాంట్రాక్టు భంగపడుతున్నదని భావించటం మొదలైనప్పుడు తాము కూడా ఆ ప్రజల పక్షాన నిలవాలి. లేక కాంట్రాక్టుకు భంగం ఏమీ కలగటం లేదని తమకు తోచినట్లయితే అదే మాట ప్రజలకు వివరించి చెప్పాలి. లేదా కాంట్రాక్టు చక్కగా అమలవుతున్నదనుకున్నట్లయితే ప్రభుత్వాన్ని ధైర్యంగా బలపరచాలి. కాంట్రాక్టు అమలుకు ఇంకా సమయం అవసరమని, ప్రజలు కొంత ఓపిక పట్టాలని అనిపించితే అదైనా చెప్పాలి. ఈ నాలుగు కాకుండా, తాము అనేక థియరీలు చదివిన మేధావులు గనుక, ఇతర పద్ధతులు ఏమైనా ఉంటే అవన్నా పేర్కొనాలి. కానీ వారు ఏదీ చేయటం లేదు. సమస్య అక్కడే వస్తున్నది. ఇంతకూ వారు జెండా లూపి ప్రభుత్వం మారాలని ప్రజలకు సలహా ఇచ్చింది ప్రజలపై ప్రేమ వల్లనా లేక కాంగ్రెస్ పట్ల ప్రేమతోనా? అనే అనుమానాలు మొదలయ్యేది అటువంటప్పుడే. అది గ్రహించలేని వారేమీ కాదు వీరు. అయినప్పటికీ మౌనంగానే మిగిలిపోతే రోజులు గడిచిన కొద్దీ ఈ అనుమానాలు సహజంగానే బలపడుతాయి.

ప్రజలకు పరిపాలనాపరమైన కాంట్రాక్టు అధికారపక్షంతో అయితే, నైతికమైన కాంట్రాక్టు ఈ జెండా మేధావులతో ఉంటుంది. సమాజంలో మేధావులది ఒక ప్రత్యేక స్థానం గనుక. ఇందుకు ఒక పోలిక చెప్పాలంటే, ఒక ఉత్పత్తికి ఫలానా మంచి గుణాలు లేకపోయినా ఉన్నాయంటూ ప్రచారాలతో ప్రమోట్ చేసే సినీతారలకు నైతిక బాధ్యత ఉండటం వంటిదన్న మాట. వారికి అటువంటి బాధ్యత ఉంటుందని కోర్టులు తీర్పు చెప్పాయి కూడా. అటువంటి సందర్భాలలో కొందరు తారలు, క్రీడాకారులు ఆ ప్రచారాల నుంచి ఉపసంహరించుకునే నిజాయితీ మాపటం మనకు తెలుసు. నిజాయితీ లేని మరికొందరు ఏవో ప్రయోజనాల కోసం అట్లానే కొనసాగుతున్నారు. వారి గురించి ఏమనుకుంటాము? ప్రజల బాగోగులతో నిమిత్తం లేకుండా సదరు కంపెనీలతో కాంట్రాక్టులే వారికి ముఖ్యం అనుకుంటాము. ఈ మేధావుల విషయంలోనూ అట్లాగే భావించవలసి వస్తుంది. అటువంటి అనివార్యస్థితిని సృష్టిస్తున్నది వారే. ఆ పని ఇతరులు చేసినట్లయితే పట్టించుకోనక్కరలేదు. కానీ మేధావులనేవారు చేయడమంటే వారిని ఏమనాలో తోచదు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా, ద్వంద్వ ప్రమాణాలు లేకుండా, కపట బుద్ధి లేకుండా ఉండాలని కోరటం తప్ప.

> **ఇప్పుడు కొన్ని విషయాలు చూద్దాము. ఎన్నికల సమయంలో ప్రజలకు, కాంగ్రెస్‌కు మధ్య కాంట్రాక్టు జరిగినవి కొన్నున్నాయి. అందుకు జెండా మేధావులు తమ ప్రచారాల కారణంగా పరోక్ష సంధాన కర్తలయ్యారు. చెప్పుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి గాని ముఖ్యమైన కొన్నింటిని చూద్దాము.**

వాటిని ముఖ్యమని పరిగణించటం ఎందుకంటే, తెలంగాణ ప్రజలలోని పెద్ద సంఖ్యల వారితో వాటికి నిమిత్తం ఉంది. వారి జీవితాలలో అవి చాలా ముఖ్యమైన విషయాలు. అటువంటి వాటిలో ఉద్యోగ నియామకాలు ఒకటి. రైతాంగం కోసం చేస్తామన్నవి మరొకటి. పేదల సంక్షేమ సంబంధమైనవి మూడవది. ఈ మూడింటిని మాత్రం చెప్పుకుందాము.

ఉద్యోగాలకు సంబంధించి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ విధంగా ఉంది. 'అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, స్పెషల్ డిపార్టుమెంట్ నియామకాల మిషన్ ద్వారా చేపట్టబడుతాయి. దరఖాస్తు దారులు ఎవ్వరూ ఒక్క రూపాయి ఫీజు కట్టవలసిన అవసరం లేదు.' కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 7న ఏర్పడింది. ఈ వ్యాసం రాసే రోజుకు 8 నెలల 5 రోజులు పూర్తయ్యాయి. ఇంకా మిగిలింది 3 నెలల 25 రోజులు. గడిచిన 8 నెలల 5 రోజులలో ప్రస్తుత ప్రభుత్వం తన వైపు నుంచి ఇచ్చిన ఉద్యోగాలు శూన్యం. అనగా, తక్కిన 3 నెలల 25 రోజులలో ఇవ్వవలసినవి 2 లక్షలు. ఆరు గ్యారెంటీలలో భాగంగా బాండ్‌పేపర్‌పై రాసి, సంతకం చేసి, రాహుల్‌గాంధీతో చెప్పించి, ఇంటింటికి వెళ్లి హామీ ఇచ్చిన మొత్తానికి మొత్తం 2 లక్షలన్నమాట.

ఇక ఇందుగురించి జరుగుతున్న వాటిని మాట్లాడుకోవాలంటేనే అలసట కలుగుతున్నది. ఇంత సుదీర్ఘకాలంలో ఒక్కటంటే ఒక్క కొత్త ఉద్యోగమైనా ఇవ్వకపోవటమే గాక, గత ప్రభుత్వ ఉద్యోగాలు 30 వేలను తమవని నిర్భయంగా అబద్ధపు మాటలు పదే పదే చెప్తున్నారు. చివరికి అసెంబ్లీలోనూ గవర్నర్‌తో అదే అబద్ధం చెప్పించి, బడ్జెట్ ప్రసంగంలో సైతం అబద్ధమాడారు. అది అబద్ధమని స్వయంగా నిరుద్యోగులే తిరస్కరిస్తున్నా ధోరణి మారటం లేదు. ఒక్క ఉద్యోగమిచ్చినట్లు రుజువు చేసినా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి అసలు రాజకీయాలనే వదిలివేయగలనని కేటీఆర్ పలుమార్లు సవాలు చేసినా ప్రభుత్వ పెద్దల నుంచి స్పందన లేదు. ఇది చాలదన్నట్లు, రాబోయే 90 రోజుల్లో 'మరో 30 వేల' ఉద్యోగాలిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జూలై 26న ప్రకటించారు. ఆ విధంగా జరుగుతుందనుకున్నా ఇంకా లక్షా డెబ్భై వేల ఉద్యోగాలు, వాటి గడువుకు కేవలం 72 రోజుల సమయం మిగులుతాయి. ఇంతకుముందే, అసలు ఏడాది గడువంటూ మొదలైన నెలన్నరకే సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జనవరి 24న మాట్లాడుతూ, చదువుకున్న వాళ్లందరికీ ఉద్యోగాలు సాధ్యం కాదని, అర్హులైన వారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు మాత్రం ఇవ్వగలమని స్పష్టం చేశారు. ప్రభుత్వపు అసలు ఆలోచనలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో ఒక్క ఉద్యోగమైనా ఇవ్వక యువతీ యువకులను మోసం చేసిందంటూ కాంగ్రెస్‌తో పాటు మేధావులు సాగించిన ప్రచారంలోని నిజానిజాలను పక్కన ఉంచుదాం. కాన